క్లుప్తంగా

ఇసుక దందాను అరికట్టాలి

చిట్యాల : చిట్యాల, టేకుమట్ల మండలాల్లోని మానేరు వాగు నుంచి విచ్చలవిడిగా ఇసుక దందా కొనసాగుతున్న జిల్లా ఉన్నతాధికారులు కనీసం పట్టించుకోవడం లేదని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మానేరు వాగు నుంచి భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్న జిల్లా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. మానేరు వాగు నుంచి ఇసుకను తరలించడం వల్ల వాగులో నీరు ఉండడం లేదని, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని వెల్లడించారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు



చిట్యాల : మండల కేంద్రంలోని హెల్త్ సబ్ సెంటర్‌కు వెళ్లే విద్యుత్ వైరు షార్ట్ సర్క్యూట్ కావడం వల్ల శనివారం నిప్పురవ్వలు ఎగిసిపడి మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన హెల్త్ సబ్ సెంటర్ సిబ్బంది పోలీసులకు, ఫైరింజన్‌కు, గ్రామ పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించారు. ఎస్సై శ్రావణ్ కుమార్, ఒడితల పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక, జీపీ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామ పంచాయతీ నుంచి వాటర్ ట్యాంకర్‌ను తెప్పించి సబ్‌సెంటర్ వద్ద మంటలను అర్పివేశారు.ఎలాంటి నష్టం జరగలేదు. అనంతరం భూపాలపల్లి నుంచి ఫైరింజన్ సిబ్బంది వచ్చి పూర్తిగా మంటలను ఆర్పివేశారు.

కాళేశ్వరం అడవిలో..



కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వర ముక్తివనం పార్కు ఎదుట నీలగిరి వనంలో మంటలు చెలరేగాయి. శనివారం సాయంత్రం అడవిలో కాళేశ్వరం దైవదర్శనానికి వచ్చిన భక్తులు వంటలు చేసుకొని నిప్పును వదిలేశారు. దీంతో మంటలు ఎగిసిపడ్డాయి. అటవీలో మంటలు చుట్టు పక్కల అర కిలోమీటర్ మేర వ్యాపించడంతో పొగతో నిండిపోయింది. దీంతో అడవిలోని మొక్కలు బూడిదయ్యాయి. నిప్పంటుకున్న విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేశారు. అడవిలో మంటలు వ్యాపిస్తుండడంతో వృక్షాలతో పాటు అటవీ జీవరాశులకు ప్రమాదం పొంచి ఉందని పలువురు వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు మాత్రం వేసవి చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

'రాజీవ్ యువ వికాసం' గడువు పొడిగించాలి

భూపాలపల్లి రూరల్ : రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తుల గడువును పొడిగించాలని తెలంగాణ మాల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పానగంటి మధుకర్, ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలకటి రాజయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు జిల్లా కేంద్రంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ సెలవులు ఎక్కువగా ఉన్న సందర్భంగా ఆదాయం, కులం సర్టిఫికెట్ల విషయంలో తహసీల్దార్ కార్యాలయాల్లో సర్వర్ డౌన్ అవ్వడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. యువత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ పథకం దరఖాస్తుల గడువును పొడిగించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలి వచ్చేదెప్పుడో!

- నెలలు గడుస్తున్నా జమకాని వేతనం
- ఇబ్బందులు పడుతున్న కూలీలు



తాడిచర్ల చింతలకుంట చెరువులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

మల్హర్ : గ్రామీణ ప్రాంతాల్లో స్థానికులకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే ఆయా ఆర్థిక సంవత్సరంలో కూలీలకు ఉపాధి కల్పించేందుకు ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకుంటారు. కానీ పనులకు వెళ్లిన వారికి నగదు జమ కావడం లేదని కూలీలు వాపోతున్నారు.

15 గ్రామ పంచాయతీల్లో పనులు

మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 8,492 జాబ్ కార్డులు ఉండగా.. 18,903 కూలీలు ఉన్నారు. ఇందులో యాక్టివ్ జాబ్ కార్డులు 5,838 ఉన్నాయి. 15 రోజుల్లో ప్రతి రోజు యావరేజ్‌గా మండలంలో 960 మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో సగటున 60 మందికి పైగా కూలీలు పనులకు వస్తున్నారు.

ఖాతాకు జమకాని నగదు

ఉపాధి పనులకు వచ్చిన కూలీలకు ఇప్పటి వరకు డబ్బులు తమ ఖాతాలో నగదు జమ కాలేదని పనులు చేసిన కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూలీలు గ్రామాల్లోను చెరువులో ఫిష్ బ్రీడింగ్ పనులు చేపడుతున్నారు. దీంట్లో భాగంగా పనికి వచ్చిన కూలీల పేరు, చేసిన పని పరిమాణాన్ని రోజు ఫీల్డ్ అసిస్టెంట్ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. కంప్యూటర్ ఆపరేటర్ వారానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. రెండు వారాల్లోగా కూలీల ఖాతాల్లో సొమ్ము జమ్మ కావాలి. కానీ ఉపాధి కూలీలకు ఐదు నుంచి ఏడు వారాల వరకు ఒక్కసారిగా కూడా కూలి డబ్బులు జమకాలేదు. దీంతో ఉపాధి పనులు చేసిన కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖర్చులకు ఇబ్బంది పడుతున్నాం..



ఆరువారాలుగా ఉపాధి హామీ పనులకు వస్తున్నా. చేసిన పనులు ఇప్పటి వరకు కూలి నగదు జమ కాకపోవడంతో ఆర్థికంగా కొంత ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇంటి ఖర్చులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం సకాలంలో కూలి డబ్బులు అందేలా చూడాలి.

– బూడిద యశోద, ఉపాధి కూలీ, తాడిచర్ల, మల్హర్

రూపాయి కూడా జమకాలే..



ఐదు వారాల నుంచి ఉపాధి హామీ పనికి వస్తున్నా. పని చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఖాతాలో ఒక్క రూపాయి కూడా కూలి డబ్బులు జమ కాలేదు. డబ్బులు రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. తొందరగా పని చేసిన వాటికి డబ్బులు ఇవ్వాలి.

– పోచయ్య, ఉపాధి కూలీ, తాడిచర్ల, మల్హర్

త్వరలో డబ్బులు జమవుతాయి



కూలీలకు ఖాతాలో డబ్బులు పడని విషయం నిజమే. ప్రస్తుతం కూలీలకు చెల్లించే డబ్బులు మాత్రం ప్రభుత్వం నుంచి విడుదల అయ్యాయి. రెండు, మూడు రోజుల్లో ఖాతాల్లో జమవుతాయి. కూలీలు ఆందోళన చెందవద్దు.

– గిరి హరీశ్, ఈజీఎస్ ఏపీఓ, మల్హర్

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ(కొత్తపల్లిగోరి) : నూతనంగా ఏర్పడిన కొత్తపల్లిగోరి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. శనివారం కొత్తపల్లిగోరి మండలంలోని పలు గ్రామాల్లో రూ.1.25 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే చిన్నకోడెపాకలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, పల్లె దవాఖాన, రేగొండ మండలంలోని తిరుమలగిరి గ్రామంలో పల్లె దవాఖానను ఆయన ప్రారంభించారు. అనంతరం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ అణగదొక్కాలని చూస్తోందని విమర్శించారు. గాంధీ, అంబేడ్కర్ ఆశయాలను, సిద్ధాంతాలను దేశంలో అమలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారి నారాయణ రావు, జిల్లా వైద్యాధికారి మధుసూదన్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, పీఆర్ డీఈ రవి కుమార్, మండల వైద్యాధికారి హిమబిందు, పంచాయతీ కార్యదర్శులు రాంబాబు, సరిత, దుర్గా భవాని, రంజిత్, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మా భూమి' సభకు తరలిరావాలి



కాటారం: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కాటారం : బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఆదిలాబాద్‌లో డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టనున్న మా భూమి రథయాత్ర ప్రారంభ సభకు తరలిరావాలని డీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిట్యాల శ్రీనివాస్ కోరారు. మండలంలోని కొత్తపల్లిలో శనివారం రథయాత్ర కరపత్రాలను ఆ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ లక్ష కిలోమీటర్ల మేర మా భూమి రథయాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లా, నియోజకవర్గంలోని డీఎస్పీ నాయకులు,ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొర్రాల్ల శ్యామ్, బొల్లి సురేశ్, మంథెన రవీందర్, శ్రీకాంత్, తరుణ్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

మొగుళ్లపల్లి : మా భూమి రథయాత్ర కరపత్రాలను మండల కేంద్రంలో డీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద రమేశ్ శనివారం ఆవిష్కరించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



కాటారం: పారాయణం చేస్తున్న మాలాధారులు

కాటారం : మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంతో పాటు చింతకాని చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. చింతకాని చెన్నకేశవ స్వామి ఆలయంలో హనుమాన్ మాలాధారణ స్వాములు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం అనుబంధ దేవాలయం కట్టమీద ఆంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈఓ మహేష్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

కాటారం : మండలంలో నేడు (ఆదివారం) రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటించనున్నారు. దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావు వర్ధంతి వేడుకల్లో ఆయన పాల్గొననున్నారు. అనంతరం కాటారం గ్రామపంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవంతో పాటు రూ.కోటితో మండల కేంద్రంలో నిర్మించనున్న స్పోర్ట్స్ స్టేడియం కాంప్లెక్స్, చిల్డ్రన్స్ పార్క్, పలు గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. శ్రీపాదరావు వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక గార్డెన్స్‌లో నిర్వహించనున్న పుష్పగిరి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అద్దాలు, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొననున్నారు.

ఆత్మీయ సమ్మేళనం



రాములు నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్ : ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్ (మాజీ ఎమ్మెల్సీ) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాములు నాయక్‌ను స్థానిక బంజారా నాయకులు ఘనంగా సన్మానించారు. బంజారా సమాజ అభివృద్ధి, సౌభ్రాతృత్వం సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇస్లావత్ దేవన్, పోరిక సమ్మయ్య, కేతావత్ వినయ్ కుమార్, అజ్మీరా జంపన్న, గుగులోత్ సంతోష్, భూక్య సురేష్, బానోత్ కిషన్, అజ్మీరా రఘురామ్, అజ్మీరా రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో 'సింగరేణి' ఆస్పత్రి ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్ : కార్మికులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు హైదరాబాద్‌లో సింగరేణి యాజమాన్యం కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిని ఏర్పాటు చేయనున్నట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. ఏరియాలోని కొమురయ్య భవనంలో శనివారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఏరియా ఆస్పత్రిలో అడ్మిట్ అయిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో అగ్రిమెంట్ చేసుకున్న ఆస్పత్రులకు పంపిస్తున్నారు. దీంతో సింగరేణి యాజమాన్యం ప్రతి ఏడాది రూ.200కోట్లను కార్మికుల వైద్యానికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి యాజమాన్యమే వైద్య సేవలు అందించాలని గుర్తింపు సంఘంగా సీఎండీ దృష్టికి తీసుకువెళ్లగా సానుకులంగా స్పందించి రూ.100 కోట్ల ఖర్చుతో ఆస్పత్రిని ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాంచందర్, సుధాకర్‌రెడ్డి, చంద్రమౌళి, నాయకులు పాల్గొన్నారు.

'గురుకుల' పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ తిరుపతి

ములుగు : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సంక్షేమ గురుకుల పాఠశాలల ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఎంపీపీఎస్ మంచినీళ్లపల్లికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి సీట్లు సాధించారు. మల్లంపల్లి మండల పరిధిలోని మంచినీళ్లపల్లి ఎంపీపీఎస్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు సంక్షేమ గురుకుల పాఠశాలలో సీట్లు సాధించడంతో మండల విద్యాధికారి వజ్జ తిరుపతి, డీసీఈబీ చైర్మన్ సూర్యనారాయణలు వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచినీళ్లపల్లి పాఠశాల విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధనకు మంచినీళ్లపల్లి పాఠశాల విద్యార్థుల ఫలితాలే నిదర్శనం అని కొనియాడారు. విద్యార్థులు ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దిలీప్, ఉపాధ్యాయుడు ఉమా శంకర్, గ్రామస్తులు కుమారస్వామి, సురేష్ పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

రేగొండ : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని రాయపల్లి, కనిపర్తి, నాగుర్లపల్లి, రేపాక గ్రామాల్లో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటినుంచి గులాబీ జెండాతో రజతోత్సవ సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, నాయకులు హింగే మహేందర్, విద్యాసాగర్‌రెడ్డి, రాజేశ్వరరావు, రహీమ్, శంకర్, సాదు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



కాళేశ్వరం: మద్దులపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..

కాటారం : మండలంలోని ధన్వాడ, గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. స్థానికంగా లభించే చిరుధాన్యాలు, ఆకుకూరలతో ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. గర్భిణుల బరువు చూసి ఆరోగ్యంగా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కారెంగుల శ్రీలత, తిత్తుల రజిత, సువర్ణ, ఏఎన్ఎం రజిత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం మద్దులపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాల గురించి తయారు చేసిన ఆహార పదార్థాల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుచరిత, శ్రీకళ, ఆశ వర్కర్ స్వరూప, తల్లులు, పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



భూపాలపల్లి అర్బన్: ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న జీఎం



చిట్యాల: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ రమేశ్

భూపాలపల్లి అర్బన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సింగరేణి యాజమాన్యం ఏరియాలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతి తెలిపారు. సింగరేణి పాఠశాలలో నిర్వహించిన ఈ వ్యాసరచన పోటీలను ఎస్సీ, ఎస్టీ ప్రతినిధులు పాల్గొని పరిశీలించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఈ నెల 14వ తేదీన కృష్ణకాలనీ మినీ ఫంక్షన్‌హాల్‌లో జరిగే అంబేడ్కర్ జయంతి వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

జయంతి ఏర్పాట్లపై సమీక్ష

అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ 14వ తేదీన సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమ ఏర్పాట్లపై ఇన్‌చార్జ్ జీఎం వెంకటరామరెడ్డి శనివారం ఏరియా అధికారులు, యూనియన్ నాయకులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

చిట్యాల : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్/కళాశాలలో ముందస్తుగా బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ప్రిన్సిపాల్ మేకల రమేశ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించిన గొప్ప మహనీయుడు అంబేడ్కర్ అని అన్నారు. దేశ వ్యవస్థ అభ్యున్నతికి తోడ్పాడే విధంగా అందరికి హక్కులను కల్పించిన యోధుడని కొనియాడారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాసాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు నీలం రవీందర్, ధనలక్ష్మీ, సమీరా, వాణి, రాజు, శివ, ఎండి కలీం పాషా, రామస్వామి, భాస్కర్, శ్రీకాంత్, రాజేంద్ర ప్రసాద్, సాగర్, షబిరుద్దీన్, పీఈటీ అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి



చిట్యాల: అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



రేగొండ: గుడిలో శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు



భూపాలపల్లి రూరల్: ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

చిట్యాల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గావ్ చలో-బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారత్ అగ్రగామిగా ఉందంటే అది రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ద్వారానే సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గజనాల రవీందర్, చింతల రాజేందర్, కేంసారపు ప్రభాకర్, గుండ మణికుమార్, ర్యాకం శ్రావణ్, కలువచర్ల కిషోర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గావ్ చలో.. బస్తీ చలో

రేగొండ : గావ్ చలో..బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావులపల్లి గ్రామంలో శనివారం బీజేపీ నాయకులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్‌రెడ్డి హాజరై సీతారామాంజనేయస్వామి ఆలయాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. బీజేపీ జిల్లా, మండల నాయకులు దాసరి తిరుపతిరెడ్డి, మోత్కుపల్లి బుచ్చిరెడ్డి, తూర్పాటి మల్లేష్, పెండ్యాల రాజు, కొడగాని రాకేష్, ఎరబాటి శివ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు పంపిణీ చేయాలి

భూపాలపల్లి రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో రేషన్ కార్డులు ఇస్తామని అబద్ధపు ప్రచారం చేసి, 12 నెలలుగా రేషన్‌కార్డులు ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ నాయకుడు దొండల రాజేందర్ అన్నారు. శనివారం భూపాలపల్లి పట్టణంలో గావ్ చలో..బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. రేషన్ కార్డులు లేక ప్రజలు బియ్యంతో పాటు అనేక సంక్షేమ పథకాలు కోల్పోతు బాధపడుతున్నారన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతిదానికి రేషన్ కార్డ్ అవసరం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కొత్త రేషన్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్టు రవి, కొమురయ్య, రాథోడ్ బాబురావు, కుమార్, శ్రీను, మునీందర్, తాండ్ర హరీష్, ఆవుల సంతోష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన మహిళా కాంగ్రెస్ నాయకులు



ఢిల్లీకి వెళ్తున్న రాజమ్మ, కాంగ్రెస్ నాయకులు

మల్హర్ : ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలో జరిగే అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ కొండ రాజమ్మ, వివిధ మండలాలకు చెందిన మహిళా కాంగ్రెస్ నాయకులు శనివారం ఢిల్లీకి తరలివెళ్లారు. రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ఊరూరా నిర్వహించిన గ్రామ సభల్లో ప్రజలను నివృత్తి చేసిన సందర్భంగా ఉత్సవాలకు వెళ్లేందుకు రాజమ్మకు గుర్తింపు దక్కినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.